www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231




విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి


ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 సంచిక : 4 24-10-2022 పుటలు : 4

## దీపావళి శుభాకాంక్షలు!!



చిన్న దివ్వె వెలుగు అంధకారాన్ని పటాపంచలు చేస్తుంది.
అజ్ఞానమనే చీకటిని విజ్ఞానమనే వెలుగుతో దూరం చేయాలి.
అహంకారం అజ్ఞానానికి సంకేతం.
అహంకారపూరితమైన నరకుడు ఏమయ్యాడో
దీపావళి కథలో మనకు తెలుసు.
అందుకే దీపాన్ని వెలిగించాలి.
దీపం చైతన్యానికి సంకేతం.
చైతన్యం వికాసానికి సంకేతం.
శ్రీకృష్ణుడు పరమాత్మునికి సంకేతం.
సత్యభామ ప్రకృతికి సంకేతం.
భూమిపుత్రుడైన నరకుడు మనుషుల్లోని
దుష్ట గుణాలకు సంకేతం.



దుష్టుడైన బిడ్డపై కన్నతల్లి యుద్ధాన్ని ప్రకటించి లోకానికి త్యాగజ్యోతి అందించిన సందర్భం దీపావళి!
అగ్నిస్వరూపమైన దీపం జ్ఞాన, సత్య, నిర్మల తత్వాలకు సంకేతం.
అటువంటి దీపావళి మానవాళికి శాశ్వతమైన ఆనందాన్ని, వెలుగును ప్రసాదించాలని ఆకాంక్ష!!

- నన్నయవాణి

## నన్నయలో అభిలేఖా (archive) కార్యాలయాన్ని ప్రారంభించిన వీసీ


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**21.10.22 (మీడియాసెల్)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభిలేఖా రీజినల్ కార్యాలయాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. శుక్రవారం యూనివర్సిటీ ఇంటర్నేషనల్ గెస్ట్ హౌస్ లో అభిలేఖా కార్యాలయాన్ని ప్రారంభించి, అపురూప గ్రంథాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అభిలేఖా కార్యాలయాన్ని ఏర్పాటు చేసారని అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ అభిలేఖా కేంద్రాలు ఉన్నాయని, దీనిలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయంలో అభిలేఖా కేంద్రాన్ని ఏర్పాటు చేసామన్నారు. ఈ కేంద్రంలో 1832 నుండి 1940 వరకూ గల ఫోర్ట్ జార్జి గెజిట్ లు, 1866 నుండి 1930 వరకూ గల జిల్లా గెజిట్ లు, 1905 నుండి 1932 వరకు రెవిన్యూ ఫైల్స్, 1905 నుండి 1934 వరకు మద్రాసు జిల్లా గెజిట్ లు, 1879 నుండి 1939 వరకు మేన్యువల్స్ మరియు అరుదైన తాళపత్ర గ్రంథాలు ఉన్నాయన్నారు. ఈ అభిలేఖా కేంద్రంలో ముఖ్యంగా తెలుగు, చరిత్ర, సంస్కృతి, రాజనీతి శాస్త్రాలకు సంబంధించిన అరుదైన గ్రంథాలు, విస్తృతమైన సమాచారం లభ్యమవుతుందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అభిలేఖా కేంద్రాన్ని తీర్చిదిద్దాలని నిర్వహకులకు వీసీ సూచించారు. అలాగే నన్నయ విశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనపరమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు పయత్నించాలన్నారు. అరుదైన గ్రంథాలను డిజిటల్ ఫార్మెట్ లోనికి తీసుకువచ్చి వెబ్ సైట్ లో పొందుపరచాలన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు అభిలేఖా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుంటూ మెరుగైన పరిశోధన పత్రాలు, ప్రచురణలు, పరిశోధన పత్రాలు వ్రాయాలన్నారు. అలాగే డా.బి.ఆర్. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నన్నయభారతి పుస్తక భాంఢాగారాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అధ్యాపకులు పుస్తకాలను చదువుతూ, విద్యార్థులచే చదివిస్తూ, పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించాన్నారు. తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభిలేఖా డైరెక్టర్ వి.రంగరాజ్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలను భద్రపరచి, భావిపరిశోధకులకు అందించేందుకు ప్రభుత్వ సూచనతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చక్కని కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన వీసీ ఆచార్య జగన్నాథరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్ లను అభిలేఖా కేంద్ర నిర్వహకులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అభిలేఖా అసిస్టెంట్ డైరెక్టర్స్ పి.వేణుగోపాల్, జి.సిహెచ్.నాయక్ మరియు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.


అభిలేఖా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ జగన్నాథరావు

## సంపాదకీయం



# చీకటి వెలుగుల రంగేళి!

జీవితమే ఒక దీపావళి. తమసోమా జ్యోతిర్గమయ! చీకటి నుంచి వెలుగులోకి పయనించటం. దీపావళి అంటే తిమిరంతో సమరం. చీకటితో పోరాటం. దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు ఒక ప్రతీక.

చీకటిని తిట్టొద్దు.చిన్న దీపాన్ని వెలిగించండంటారు ఖలీల్ జిబ్రాన్. ఒక జానపద కథలో తండ్రి తన కొడుకులు ముగ్గురిని పిలిచి ఈ గదిని అతి తక్కువ ఖర్చుతో నింపిన వారికే తన ఆస్తినిస్తానంటాడు. పెద్దవాడు గడ్డితో, చిన్నవాడు దూదితో నింపారు. చివరివాడు చిన్న దీపాన్ని వెలిగించి ఆ గదిని వెలుతురుతో నింపాడు. జ్ఞానానికి మరో పేరు వెలుగు.అదే ఆ కథలో ఉన్న సారాంశం.

ఇంత జగత్తును ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలిగించాను. ఇప్పుడు నేను అస్తమిస్తున్నాను. నా బాధ్యత ఎవరు తీసుకుంటారు? అని అడిగాడు సూర్యుడు.నేను తీసుకుంటున్నాను స్వామీ! అంది చిన్న దీపం.చిన్న వాక్యంలో ఎంత సందేశాన్నిచ్చారు ఠాగూర్ మహాశయులు.

ప్రాచీన సాహిత్యంలో కథానాయికల కన్నా కావ్య నాయికలు ఎక్కువ. కథానాయిక లోటును సత్యభామ తీర్చింది. స్త్రీలలో ధీరత్వం ఒక భాగమని చాటింది.వాలుజడ ముడేసి, కొంగు బిగించి విల్లందుకొని శత్రువుకి ఊపిరాడకుండా బాణాలు వదిలింది. నరకుని రథాన్ని కూల్చింది. ఆయుధాలు ధరించి అసుర చీకట్లను తొలగిస్తూ నరకాసురుని సంహరించి తానే తొలి దీపమైంది. ప్రజలందరికీ దీపావళి పండుగనిచ్చింది.

సత్యా విజయానికి లోకాలన్నీ జయజయ ధ్వానాలు చేశాయి. కృష్ణుడు ఆమె విజయానికి చిహ్నంగా పూలదండను కాదు కాదు విజయ మాలికను ఆమె మెడలో వేశాడు. ఆమె ఓ నవ్వు నవ్వింది. అది నవ్వు కాదు.దివ్వె. ఆ దివ్వెల వెలుగు దీపావళి పండుగ అయింది.

సత్యభామ భూమాత అంశ. ఈ నేలంతా దీపాలమయమైంది. ఆ వెలుగులో ఆమె మహిళాలోకానికి ప్రతిరూపంగా నిలిచింది. ఒక స్త్రీ విజయమే దీపావళి.

స్త్రీల ధైర్యం, విజయాలే ఇంటికి వెలుగు. ఆ వెలుగులో పిల్లల ఆనందాలు,భర్త మమకారాలు, పెద్దల ఆత్మీయతలు ప్రతిఫలిస్తూ ఉంటాయి. అందుకే "ఇంటికి దీపం ఇల్లాలే" అనే నానుడి పుట్టుకొచ్చింది.

కష్ట సుఖాలను,సంతోష విచారాల్ని, లోటుపాట్లను సమంగా భరిస్తూ, కుటుంబాన్నిఉద్ధరిస్తూ ఒక వెలుగులో ముందుకు నడవటం, సంసారాన్ని తీర్చిదిద్దుకోవటమే చీకటి వెలుగులు. అందుకే జీవితం ఒక దీపావళి!!

# నన్నయభారతిని పరిశీలించిన వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ లోని నన్నయభారతి మరియు నన్నయ అధ్యయన కేంద్రాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. త్వరలో విశ్వవిద్యాలయంలో నాక్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలోని ప్రధాన విభాగాలను వీసీ పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయాన్ని, నన్నయ భారతి , నన్నయ అధ్యయన కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, ఎక్కువమంది పాఠకులను గ్రంథాలయానికి రప్పించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంటుందన్నారు.





పాఠకులకు అవసరమైన అన్ని వసతులను లైబ్రరీలో సమకూర్చాలన్నారు. నన్నయ భారతిని సందర్శించి దాతలు సమర్పించిన అరుదైన పుస్తకాలను నాక్ బృందం పరిశీలన సమయంలో ప్రదర్శనకు అనువుగా ఏర్పాటు చేయాలన్నారు. నన్నయభారతిలోని తాళపత్ర గ్రంథాలను, ఆముద్రిత పుస్తకాలను, అపూర్వ పుస్తకాలను ఆయన పరిశీలించారు. నాక్ దృష్ట్యా నన్నయ భారతి డొనేటెడ్ బుక్స్ వింగును మరింత అభివృద్ధి పరచి విశ్వవిద్యాలయ ప్రత్యేకతకు ప్రతిబింబముగా ప్రదర్శింపచేయాలని కోఆర్డినేటర్ డా. తలారివాసుకు సూచించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీయన్ డా.టి.సింహాచలం, ఫ్యాకల్టీ అసోసియేట్స్ డా.సతీష్, డా.రాజేశ్వరిదేవి, వెబ్ మాస్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# ఇంజనీరింగ్ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్




ఇండస్ట్రియల్ విజిట్ ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్

**19.10.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్టమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో బెంగుళూర్ లోని పలు ప్రాంతాలకు ఇండస్ట్రియల్ విజిట్ కు వెళ్ళారు. బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ ఇండస్ట్రియల్ విజిట్ ను జెండాఊపి ప్రారంభించి వివరాలను తెలియజేసారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మెరుగైన అవకాశాలను కల్పిస్తున్నామని, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపుతో కూడిన నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని అన్నారు. పాఠ్య ప్రణాళికలలో భాగంగా 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు డిపార్టమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులను బెంగళూర్ ఇండస్ట్రియల్ విజిట్ కు పంపిస్తున్నామన్నారు. బెంగుళూర్ లోని సి.ఎస్.ఐ.ఆర్ – నేషనల్ ఎరోస్పేస్ లెబోరేటరీ, ఐ.ఎస్.ఆర్.ఓ – యు.ఆర్.రావు శాటిలైట్ సెంటర్, శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం వంటి ప్రాంతాలను సందర్శిస్తారని చెప్పారు. ఇంజనీరింగ్ లోని అద్భుతాలను ఆవిష్కరించిన ఇటువంటి ప్రాంతాలలో పర్యటించడం ద్వారా విద్యార్థులకు క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ విధానాలు అలవాటు అవుతాయన్నారు. ఇంజనీరింగ్ లో మెరుగ్గా రాణించాడానికి ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. అధ్యాపకుల మార్గదర్శకంలో విద్యార్థులు క్రమశిక్షణతో ఇండస్ట్రియల్ విజిట్ ను పూర్తి చేసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డా.బి.సుధాకిరణ్, డా.వెంకటరత్నం, లక్ష్మీభాయ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచిమాట



"Nobody is going to pour truth into your brain.It's something you have to find out for yourself,."

సత్యాన్ని నీ మెదడులో ఎవరూ పోయరు. నీకు నీవే శోధించాలి.

**Noam Chomsky**
ప్రపంచ ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త

# నన్నయలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ బలోపేతం

### డైరెక్టర్ ప్లేస్మెంట్ డివిజన్ గా ఆచార్య సురేష్ వర్మ
### క్యాంపస్ కళాశాలలో అసిస్టెంట్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్లుగా అధ్యాపకులు

**20.10.22 (మీడియాసెల్)**


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలకు డైరెక్టర్ ప్లేస్మెంట్ డివిజన్ గా కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మను నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు అందజేసారు. గురువారం యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ జగన్నాథరావు డైరెక్టర్ ప్లేస్మెంట్ డివిజన్ గా ఆచార్య సురేష్ వర్మకు, మరికొందరు టీచింగ్ స్టాఫ్ ను అసిస్టెంట్ ప్లేస్మెంట్ %ం% ట్రైనింగ్ ఆఫీసర్లుగా నియమించారు. వారిలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకులు కె.వి.వి.రమణ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు డా.జె.బాలాజీచంద్రమౌళి, ఆర్ట్స్ అండ్ కామర్స్ అధ్యాపకులు డా.జె.రవిశంకర్, ఎడ్యుకేషన్ కాలేజ్ డా.ఆర్.ఎస్.వరహాలదొర, కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ డా.ఎం.శ్రీరామరాజు, తాడేపల్లిగూడెం క్యాంపస్ అధ్యాపకులు డా.జె.మదనమోహన్ లకు అసిస్టెంట్ ప్లేస్మెంట్ & ట్రైనింగ్ ఆఫీసర్లుగా ఉత్తర్వులందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి సూచనల మేరకు ప్రతీ విశ్వవిద్యాలయంలో ప్లేస్మెంట్, స్కిల్ డెవలప్మెంట్, ఇంటర్న్ షిప్ లను బలోపేతం చేసి విద్యార్థులకు చక్కని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని అనుబంధ కళాశాలల్లోని విద్యార్థులకు చక్కని ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించామన్నారు. డిగ్రీ విద్యార్థులకు రెండు నెలల ఇంటర్న్ షిప్ మరియు ఆరు నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలను ఆయా సంస్థల సహకారంతో అందించామన్నారు. అలాగే విశ్వవిద్యాలయం స్థాయిలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ లను బలోపేతం చేయడానికి అనేక కార్యక్రమాలను చేపట్టడంతో పాటు ప్రైవేటు కంపెనీల సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా ఇచ్చే బజాజ్ వాల్ చంద్ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అవకాశాలను ఉపయోగించుకుంటున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తోను మరియు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్లేస్మెంట్, స్కిల్ డెవలప్మెంట్, ఇంటర్న్ షిప్ లను మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు యూనివర్సిటీలో డైరెక్టర్ ప్లేస్మెంట్ డివిజన్ గా ఆచార్య సురేష్ వర్మను మరియు ఆయా కళాశాలల్లో ప్లేస్మెంట్ ఆఫీసర్స్ ను నియమించామన్నారు. కాకినాడ మరియు తాడేపల్లిగూడెం నుండి క్యాంపస్ కళాశాలలు మరియు క్యాంపస్ల ప్లేస్మెంట్ అధికారులు తీసుకున్న అన్ని ప్లేస్మెంట్ సంబంధిత కార్యకలాపాలను పర్యవేక్షిస్తారన్నారు. వివిధ కళాశాలల్లో ప్లేస్మెంట్ అధికారులను సమన్వయం చేయడం ద్వారా వివిధ కళాశాలల్లో ప్లేస్మెంట్ డ్రైవ్ ల ప్రణాళికలను అమలు చేస్తారన్నారు. విద్యార్థులకు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం మరియు విద్యార్థులను ఉపాధి పొందేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం వంటివి చేయాలన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యార్థుల ప్రయోజనం కోసం అలాగే అనుబంధ కళాశాలల కోసం వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ నైపుణ్య సంస్థలు మరియు సంస్థలతో కలిసి పని చేయాలన్నారు. క్యాంపస్ కళాశాలల విద్యార్థులకు మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఇంటర్న్షిప్ కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.



డైరెక్టర్ ప్లేస్మెంట్ డివిజన్ గా ఉత్తర్వులందిస్తున్న వీసీ

# స్ఫూర్తినిచ్చే వీరుడి పోరాటం

పుస్తకం




"చావుకు నేను భయపడను..కానీ నా కోరిక ఒక్కటే ఈ యుద్ధంలో మనమే గెలవాలి.చనిపోవడానికి ముందు ఎలాగైనా సరే "టైగర్ హిల్" పై మన త్రివర్ణ పతాకం ఎగురవేయాలి". ఓ సైనికుడి మనసులో కోరిక ఇది.అది కార్గిల్ యుద్ధం.. ఆ సైనికుడి పేరు యోగేంద్ర సింగ్ యాదవ్.ఆ వీరుడి పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు తెలుపుతుంది "ది హీరో ఆఫ్ టైగర్ హిల్" పుస్తకం.

భారత అత్యున్నత సైనిక పురస్కారం "పరమవీరచక్ర" అవార్డు పొందిన అతి పిన్నవయస్కుడు యోగేంద్రసింగ్ యాదవ్ జీవితచరిత్ర ఈ పుస్తకం.ఈ పుస్తకాన్ని రాసింది కూడా ఈయనే. ఈ పుస్తకంలో బాల్యం, సైన్యంలో చేరడం, కార్గిల్ యుద్ధం అనే మూడు అంశాలున్నాయి.ఉత్తరప్రదేశ్ లోని బులంద సహర్ అనే మారుమూల గ్రామంలో జన్మించిన ఈయన చిన్నప్పటి అల్లరి, పొలం పనులు, తండ్రి క్రమశిక్షణ పాఠాలు మొదటి చాప్టర్లో వివరించారు. తండ్రి బాటలో సైన్యంలో చేరడం అందుకు చేసిన కృషి రెండో చాప్టర్ లో కనిపిస్తాయి. ఇక ఆఖరిదైన మూడవ చాప్టర్లో అందరినీ ఉత్కంఠతో చదివించేది కార్గిల్ వార్ అంశం.వేల అడుగుల ఎత్తులోని టైగర్ వాల్ పై పాకిస్థాన్ సైనికులతో యోగేంద్ర చేసిన పోరాటం,భారత సైనికులు చేసిన వీరోచిత పోరాటాలు కళ్లకు కట్టినట్లు వివరించడం జరిగింది.

అప్పటికి యోగేంద్రకు 19 ఏళ్లు.భారత సైన్యంలో 18 వ రెజిమెంట్ లో పనిచేస్తున్నారు.దొడ్డిదారిన,అక్రమంగా వచ్చి కార్గిల్ లోని టైగర్ వాల్ పై తిష్ట వేసిన పాకిస్తాన్ సైనికులును తరిమికొట్టేందుకు రంగంలోకి దిగింది యోగేంద్ర టీమ్.కానీ శత్రు సైనికులు చాలా ఎత్తులో ఉండటం వలన వాళ్లని ఎదుర్కోవడం చాలా కష్టం అయింది.అలాంటి పరిస్థితుల్లో తానే ముందుండి నడిచారు యోగేంద్ర.బుల్లెట్ దెబ్బలు,బాంబు పేలుళ్ళతో ఎగిసిపడుతున్న రాళ్లురప్పలు తగులుతున్నా వెనుకంజ వేయకుండా ముందుకు నడిచారు.తన టీంలో అందరూ చనిపోయిన తుది వరకు పోరాడి శత్రు సైనికులను తరిమికొట్టి టైగర్ హిల్ పై జాతీయ జెండాని ఎగుర వేశాడు.
యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డ యోగేంద్ర ఆరు నెలలు మంచానికే పరిమితం అయ్యాడు.తర్వాత ఆర్మీ నుంచి రిటైర్ అయ్యాడు. అతని పోరాటాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం "పరమ వీర చక్ర" అవార్డుతో సత్కరించింది.

ఆంగ్లంలో వచ్చిన "ద హీరో ఆఫ్ టైగర్ వాల్" పుస్తకంలోని భాష అందరికీ అర్థమయ్యే విధంగా ఉంది. అందరూ ఈ పుస్తకం చదివి కార్గిల్ వార్ పోరాటాన్ని, సైనికుల వీరోచిత పోరాటాలను గుర్తుకు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను.తన జీవితగాథను పుస్తక రూపంలో రాసి అందరిలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేసిన యోగేంద్ర సింగ్ యాదవ్ కు ధన్యవాదాలు.

**బి.సుశాంత్ కుమార్,**

బి.ఎడ్. పూర్వ విద్యార్థి,
ఆదికవి నన్నయ యూనివర్సిటీ



# పాలకొల్లులో ఘనంగా ఆదిత్య అచీవర్స్ డే



పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదిత్య డిగ్రీ కళాశాల అచీవర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యపైనే ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువుకునే విద్యాలయం దేవాలయంగా భావించి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులతో పాటు ఊరికి, కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో ఎక్కువమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఆదిత్య విద్యా సంస్థలకు అభినందనలు తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్మెంట్, అమ్మఒడి ప్రభుత్వ పాఠశాలలకు నాడు నేడు ద్వారా కార్పొరేట్ స్థాయి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పాలకొల్లు ఆదిత్య విద్యార్థులు 480 ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు . ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ పాలకొల్లు ఆదిత్య కళాశాలలో డిగ్రీ పూర్తయిన 276 మంది విద్యార్థులకు 480 ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఒక విద్యార్థి ఏకంగా ఏడు ఉద్యోగాలకు ఎంపికవడం గర్వకారణంగా ఉందని చెప్పారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆదిత్య డిగ్రీ కాలేజీ నుంచి 30,800 ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇందులో 485 కంపెనీలు ఆదిత్య కళాశాలకు రాగా అందులో 90 శాతం మల్టీ నేషనల్ కంపెనీలు వచ్చాయన్నారు. ఇలా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థుల్లో 90 శాతం మంది విద్యా దీవెన అందుకున్న విద్యార్థులే కావడం గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థి కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పుడు పట్టాతో పాటు ఉద్యోగం కూడా తీసుకువెళుతున్నారని వివరించారు. అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్వీ రాఘవరెడ్డి, డాక్టర్ ఎన్.సుగుణ రెడ్డి , ప్రిన్సిపాల్ వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.







# విశ్వవిద్యాలయ అభివృద్ధిలో కమ్యూనికేషన్ కీలకం



విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో కమ్యూనికేషన్ కీలకపాత్రను పోషిస్తుంది. అటువంటి కమ్యూనికేషన్ లో పత్రికలు, చానల్స్ ప్రధానమైనవి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మీడియా సెల్ ఆధ్వర్యంలో నడపబడుతున్న నన్నయవాణి వారపత్రిక, నన్నయ న్యూస్ టీవీ ఛానల్ ఎంతో ప్రజాదారణ పొందుతూ విశ్వవిద్యాలయ ప్రగతికి చిహ్నంగా నిలుస్తున్నాయి. నన్నయవాణి ప్రారంభించిన అనతి కాలంలోనే విశ్వవిద్యాలయం ఖ్యాతిని దశదిశలా ఇనుమడింపచేసింది. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధిని విశ్వవ్యాప్తం చేసింది. డిజిటల్ యుగంలో ఇది సునాయాసంగా సాధ్యమైంది. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పలువురికి తెలియచేయడంతో పాటు, ప్రముఖుల గురించి ప్రత్యేక వ్యాసాలు రాయించడం గొప్ప విశేషం. ఇప్పటి తరానికి అవి చాలా అవసరం. దేశంలో చాలా విశ్వవిద్యాలయాలు ఇలాంటి న్యూస్ లెటర్లు ప్రచురిస్తున్నా, చాలా ప్రొఫెషనల్ గా ముద్రిస్తున్న నన్నయవాణి అన్నింటి కంటే ప్రత్యేకం. NAAC, NIRF లాంటి జాతీయ సంస్థలు ఇలాంటి ప్రచురణలను ప్రోత్సహిస్తూ వాటికి ప్రత్యేక మార్కులు కేటాయించడం విశేషం. అలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని నన్నయ విశ్వవిద్యాలయం ఇలాంటి ఒరవడికి శ్రీకారం చుట్టడం అనేక విశ్వవిద్యాలయాలకు మార్గదర్శక మయింది. ముందు, ముందు మరిన్ని విశేషాలతో, విషయాలతో తన ప్రస్థానాన్ని కొనసాగించి విశ్వవిద్యాలయ ఖ్యాతిని మరింత పెంచాలని కోరుకుంటూ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

**ఆచార్య భట్టు రమేష్**
**రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్**

# విజేతలు.... పరాజితులు



విజేతలు ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటారు....
పరాజితులు ఓడిపోతానేమో అని భయపడతారు.
విజేతలు తాము పొందే లాభాన్ని చూస్తారు.
పరాజితులేమో తాము పడే కష్టాన్ని చూస్తారు.
విజేతలు సమస్యలలో సవాళ్ళను చూసి ఎదుర్కొంటారు.
పరాజితులేమో సమస్యలలో సాకులను వెతుకుతారు.
విజేతలు ఏ పని అయినా జరిగేటట్లు చూస్తారు.
పరాజితులేమో జరిగితే బాగుంటుంది అని అనుకుంటారు.
విజేతలు తమ లోపాలను తెలుసుకొని, బలాలపై దృష్టి పెడతారు.
పరాజితులు మాత్రం తమ బలహీనతలను తలుచుకుంటారు.
పారిపోవడం సులభమే...కానీ పోరాటమే కష్టం.
పలాయనమే పరాజయం.... కానీ, పోరాటమే విజయం.
పరాజితులంటే ఎవరో కాదు..ఓర్పు లేని విజేతలే.
విజేత అంటే ఎవరో కాదు..కడదాకా ప్రయత్నించిన పరాజితుడే!
విజేతలకు వినమ్రతే భూషణం అవుతుంది.
గౌరవంగా ఓటమిని స్వీకరించి, ఓర్పుగా అన్నీ నేర్చుకునేవారే నిజమైన విజేతలుగా నిలుస్తారు.

**- బి.సుశాంత్**